# తలెత్తుకునేలా 'ఆసరా'

- దివ్యాంగులకు అండగా బీఆర్ఎస్
- రూ.4వేలు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే..
- కాంగ్రెస్ పాలనలో తలదించుకునేలా పింఛన్లు
- ఇప్పుడు ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- రూ. 500 పింఛన్ రూ. 4 వేలైంది
- దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవారెడ్డి
- భూపాలపల్లిలో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం
- బీఆర్ఎస్‌కే ఓటు వేస్తామని తీర్మానం


దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 4(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో తలదించుకునేలా పెన్షన్లు ఉన్నాయని, సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులు తలెత్తుకుని బతికేలా చేశారని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన నీలాంబరం యాదవ్ అధ్యక్షతన జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే గండ్రతో పాటు రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మనసున్న నాయకుడని, దివ్యాంగులు గౌరవంగా జీవించాలని వారి పెన్షన్‌ను రూ. 4 వేలు చేశారని, పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక రూ. 6 వేలకు పెంచనున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఆసరా పెన్షన్లు సైతం పెరగనున్నాయన్నారు. కేవలం దివ్యాంగులకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు పథకాలు ప్రవేశపెడుతూ విజయవంతంగా అమలు చేసి దేశానికి దిక్సూచిగా మారారని అన్నారు. రేషన్‌కార్డు ఉన్న వాళ్లందరికీ రూ. 5 లక్షల బీమాతో పాటు సన్నబియ్యం అందించనున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.15లక్షలకు పెంచారని, సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు రూ. 3 వేలు అందనున్నాయన్నారు. డబుల్‌బెడ్ రూం, గృహలక్ష్మి, దళితబంధులో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ ఇప్పించిన ఘనత వాసుదేవారెడ్డికే దక్కుతుందన్నారు. దివ్యాంగులు అడగకుండానే పెన్షన్‌ను పెంచారన్నారు. భూపాలపల్లిలో నిర్మించిన దివ్యాంగుల భవనంలో టీవీ, బెడ్లు, పేపర్లు అందుబాటులో ఉంచి విశ్రాంతి తీసుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తాను గెలిచాక పెన్షన్ రాని వారందరికీ సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని గండ్ర హామీ ఇచ్చారు. అనంతరం భూపాలపల్లి ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు వాసుదేవారెడ్డి సన్నిహితుడని, సమస్యలను ఎప్పటికప్పుడు సీఎంకు వివరిస్తూ అండగా నిలుస్తున్నారని అన్నారు. దివ్యాంగ ఓటర్లు 6 వేల మంది ఉండగా కుటుంబ సభ్యులతో కలిపి సుమారు 20 వేల ఓట్లు గండ్ర వెంకటరమణారెడ్డికే వేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్ మాట్లాడుతూ భూపాలపల్లిలో ఉన్న దివ్యాంగుల వసతి గృహంలో తాను టీవీని ఏర్పాటు చేస్తానన్నారు. అనంతరం గండ్ర వెంకటరమణారెడ్డి, వాసుదేవారెడ్డి స్వయంగా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కళ్లెపు శోభ, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు మున్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాంసాని నర్సింగరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంగల రమేశ్, దివ్యాంగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వంగ నర్సయ్య, జాగృతి జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కుమారస్వామి, జిల్లా నాయకుడు కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

### పెన్షన్ పెంచిన ఘనత కేసీఆర్‌దే

**కేతిరెడ్డి వాసుదేవారెడ్డి**

కాంగ్రెస్ హయాంలో రూ.500 పెన్షన్ దివ్యాంగులకు ఇచ్చే వారని, కేసీఆర్ సీఎం అయిన తర్వాత రూ. 4 వేలు ఇస్తున్నారని, ఎన్నికల తర్వాత రూ. 6 వేలకు పెంచనున్నారని వాసుదేవారెడ్డి అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 200 పెన్షన్ ఇస్తున్నదని, కర్ణాటకలో రూ.1100 చేశారని, గుజరాత్‌లో ఇటీవలె రూ.1000కి, రాజస్థాన్‌లో రూ.1500లకు పెంచారన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఎక్కడ కూడా రూ.1500 దాటి పెన్షన్ ఇవ్వడం లేదని, ఇక్కడ వారు గెలిస్తే రూ. 5 వేలు ఇస్తామంటే నమ్మేవారు లేరన్నారు. అధికారం కోసం ఇతర పార్టీలు చెప్పే మాయ మాటలు నమ్మొద్దన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఇస్తున్న పెన్షన్లు ఏ రాష్ట్రంలోనూ ఇవ్వడం లేదని గుర్తు చేశారు. ఎవరైనా సరే తిన్న రేవును తలవాలని, దివ్యాంగులను ఆదరిస్తున్న సీఎం కేసీఆర్‌ను గెలిపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డికి ఓటు వేసి గెలిపించుకుంటామని దివ్యాంగులు తీర్మానం చేశారు.

## బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న వలసలు

**ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో పలువురు చేరిక**

శాయంపేట, నవంబర్ 4 : బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నుంచి రెడ్డి సామాజిక వర్గం, యాదవ సంఘం నుంచి 50 మంది శనివారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా, వీరికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో అమిరెడ్డి మల్లారెడ్డి, చల్లా దయాకర్ రెడ్డి, చల్లా రాజిరెడ్డి, దూదిపాల కొమరారెడ్డి, తిరుపతి రెడ్డి, దూదిపాల పృథ్వీధర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చల్లా మహేందర్‌రెడ్డి, ఊకంటి మహేశ్‌రెడ్డి, దూదిపాల పెద్దన్న, దూదిపాల విష్ణువర్ధన్‌రెడ్డి, దూదిపాల రాజు, సొంటిరెడ్డి జనార్దన్‌రెడ్డి, బొంతల శ్రీను, బొంతల తిరుపతి తదితరులున్నారు. కార్యక్రమంలో వంగాల నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దూదిపాల తిరుపతిరెడ్డి, అరికిల్ల ప్రసాద్, విజయ, అర్జల సునీతాసాంబరెడ్డి, రాజిరెడ్డి, మస్కె సదయ్య, నూనె కిరణ్, మోతె సమ్మయ్య, చల్లా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో పార్టీలో చేరుతున్న మైలారం నేతలు

## తనిఖీల్లో రూ. 97 వేల నగదు సీజ్

శాయంపేట, నవంబర్ 4 : మండలంలోని మాందారిపేట వద్ద శనివారం సాయంత్రం చేపట్టిన తనిఖీల్లో రూ. 97 వేల నగదును పోలీసులు పట్టుకున్నారు. మాందారిపేట వద్ద సీఐ మల్లేశ్, ఎస్సై దేవేందర్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. హనుమకొండ నుంచి పరకాల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సిద్దంశెట్టి నితిన్‌ను తనిఖీ చేయగా, అతడి బ్యాగ్‌లో రూ. 97 వేలు దొరికాయి. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండటంతో నగదును సీజ్ చేసి భూపాలపల్లి రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## నేడు ఎమ్మెల్యే గండ్ర ఆత్మీయ సమ్మేళనాలు

శాయంపేట, నవంబర్ 4 : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాల్లో బీఆర్ఎస్ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొంటారని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గంగిరేణిగూడెం, సాధనపల్లి, రాజుపల్లి, కాట్రపల్లి, నూర్జహాన్‌పల్లి, అప్పయ్యపల్లి, నేరేడుపల్లి, ప్రగతి సింగారం, పత్తిపాక, హుస్సేన్‌పల్లి, మైలారం, శాయంపేట, ఆరెపల్లి, కొత్తగట్టు సింగారం గ్రామాల్లో సమ్మేళనాలుంటాయన్నారు. వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరుకానున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు.

## చిన్నారికి ఎమ్మెల్సీ కవిత ఆశీర్వాదం


అశోక్ కుటుంబ సభ్యులతో కవిత

శాయంపేట, నవంబర్ 4 : చిన్నారికి ఎమ్మెల్సీ, జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆశీర్వాదం అందించారు. మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన తెలంగాణ జాగృతి యువత రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ కుమారుడు నిహాంత్ పుట్టిన రోజును శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కవితను హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో తన భార్య జ్యోతి, కుమారుడితోపాటు అశోక్ కలుసుకోగా, నిహాంత్‌కు కవిత కేకు తినిపించారు. తమ కుమారుడిని ఆశీర్వదించిన కవితకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## నాటుసారా రవాణా చేస్తే కఠిన చర్యలు

**పరకాల ఎక్సైజ్ సీఐ జగన్నాథరావు**

శాయంపేట, నవంబర్ 4 : నాటుసారా(గుడుంబా)ను తయారు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పరకాల ఎక్సైజ్ సీఐ జగన్నాథరావు హెచ్చరించారు. ఆయన కథనం ప్రకారం శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కాట్రపల్లి–ప్రగతిసింగారం దారిలో ఒక వ్యక్తి ఎక్సైజ్ అధికారులను చూసి తన ద్విచక్ర వాహనాన్ని వదిలేసి పారిపోయాడు. బైక్‌కు ఉన్న సంచిని తనిఖీ చేయగా 15 లీటర్ల నాటుసారా దొరకగా స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వ్యక్తి కాట్రపల్లితండాకు చెందిన వాంకుడోత్ బావుసింగ్‌గా గుర్తించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ పద్మ, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి, సమ్మయ్య, శ్రీనివాస్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


టేకుమట్ల : ప్రచారంలో పాల్గొన్న ప్రియాంకరెడ్డి


గణపురం : లక్ష్మారెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం


శాయంపేట : పత్తిపాకలో నేతల ప్రచారం

## గ్రామాల్లో ఊపందుకున్న ప్రచారం

- గండ్ర గెలుపు కోసం ఓట్ల అభ్యర్థన

టేకుమట్ల, నవంబర్ 4 : భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలో శనివారం జరిగిన ప్రచారంలో గండ్ర కూతురు ప్రియాంకరెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ద్వారకాపేట, బూర్నపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆమె ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవి, సర్పంచ్ భిక్షపతి, శంకర్, పెరుమాండ్ల చంద్రకళా మొగిలి, నేరెళ్ల రామకృష్ణ, గందం సారయ్య, స్వామి, కుమార్, రాజు, సమ్మయ్య, చేరాలు, శ్రీను పాల్గొన్నారు.

**చిట్యాలలో..**

చిట్యాల : అంసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. శనివారం మండలంలోని పాశిగడ్డ తండాలో జడ్పీటీసీ గొర్రె సాగర్ ఇంటింటా తిరుగుతూ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఏరుకొండ గణపతి, లావుడ్య రజితాహరిభూషణ్, రాజు, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**గండ్ర గెలుపు ఖాయమైంది..**

గణపురం : బీఆర్ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు ఖాయమైందని గణపురం పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలో సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్, ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్ గౌడ్, చెల్పూరులో సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్‌రావుతో పాటు ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సంతోష్, రవి, రాజు, తావురియా, సీతారం, మొగిలి, రమణారెడ్డి, శ్రీకాంత్, హఫీజ్, రమాదేవీ మధుకర్, అయిత రమేశ్, జెట్టి కనకరాజు, రజియా, పిన్నింటి శ్రీనివాస్‌రావు, అంజద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

**పత్తిపాకలో..**

శాయంపేట : మండలంలోని పత్తిపాకలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పసుల ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, మ్యానిఫెస్టోను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి గండ్ర వెంకటరమణారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సరోజనా మల్లయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, సమ్మిరెడ్డి, రాజిరెడ్డి, ప్రకాష్, ఐలయ్య, సాంబరాజు,కుమారస్వామి, చేరాలు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.